హాస్యకథ

# శ్రీదేవితో సరసం

- కె.సుదర్శన్.

శ్రీదేవి మాకాలనీ కొచ్చిందని వినగానే మేఁవంతా ముందు కంగారు పడ్డాం. తర్వాత ఆశ్చర్యపోయాం.

"శ్రీదేవేంటి? మన కాలనీకి రావడమేంటి?" అంటూ కుర్రకారు క్రాపులు దువ్వుకున్నారు!

అందరం కలిసి కాలనీ 'న్యూస్ పేపర్' గంగారాంని అడిగాం 'విషయ మేంటీ' అని.



"అవ్. అచ్చింది. మనింట్లోనే దిగింది మల్ల" అంటూ గంగారాం ఎన్టీఆర్ పోజిచ్చాడు.

మేం వెర్రి మొహాలేసుకుని "నిజఁవా? ఎప్పుడొచ్చింది గంగన్నా?" అంటూ మర్యాద ప్రదర్శించాం.

"నిన్న పొద్దుమీక్కి దిగిన్రు. వాల్ల నాయ్న దీస్క చ్చిండు. అమ్మాయి నాన్న మనదోస్తులే" అంటూ మరింత గీర ప్రదర్శించాడు.

ఎక్కడో తిరకాసుంది. శ్రీదేవి నాన్న పరలోక యాత్రలకెళ్ళి పోయారు అని పేపర్లు రాశాయి.

అల్లాంటిది ఆయన తీసుకురావడమేఁవిటి అమ్మాయినీ, జ్ఞానోదయం కావడం ప్రారంభమైంది.

"ఇంతకీ... ఏ శ్రీదేవి గురించి బాబూ తమరు చెబుతున్నదీ"

అని గంగారాం చొక్కా పుచ్చుకోబోయే ంతలో, మా వీధి చివర తళుక్కుమని ఓ మెరుపు మెరిసినట్టయి తలలు అప్రయత్నంగా అటువేపు తిరిగాయి.

అందానికే చీర, జాకెట్టూ కట్టినట్టు... పొందిగ్గా ఉన్న ఓ అమ్మాయి కదిలి మావేపు రావడం ప్రారంభించింది.

సడెన్‌గా వెనక జేబునుంచి దువ్వెన తీసి, ఊడి పోగా మిగిలిన జుట్టును దువ్వటం ప్రారంభించాడు శీను.

బాగానే టక్‌చేసి ఉన్న డ్రెస్‌ని సవరించి షోగ్గా నిలబడటానికి తిప్పలుపడుతున్నాడు రమణ. అందరూ తలోరకంగా సర్దుకోవడం ప్రారంభించారు.

నిజం చెప్పొద్దూ! నాకూ అనిపించింది. ఏఁవైన సర్దుకుందామని. అంతలోనే ఆ అందం మా ముందు కంటా వచ్చేసింది.

ఊపిరా డ్డంలా జనానికి. కళ్ళు ఆమెకి అతుక్కుపోయాయి. సకిలింపులు, ఇకిలింపులు లేని నిశ్శబ్ద సౌందర్యారాధన చేస్తున్నాం!

'సర్వాంగాలు సౌందర్యంతో పొంగారే ఆలిండియా అందాల తార శ్రీదేవి అంతగాకున్నా... యమా అందంగా ఉందిరా బాబూ' అనుకున్నాం మనసులో

మేం అలా చూస్తుండగానే గంగారాం ఆమె దగ్గరకంటా వెళ్ళి:

"జరంతాగమ్మా. ఈల్లందరూ మానోల్లే. మీ అంకుల్స్"

అంటూ మమ్మల్ని పేరు పేరునా పరిచయం చేశాడు.

"సిరిదేవొచ్చిందంటివే... గీయమ్మే. బెంకులో నౌకరీ. హ్హిహ్హిహ్హి" అంటూ పళ్ళికిలించాడు.

ఆమె అందరివంకా సొగసుగా చూసి "నమస్తే" అని చెప్పి హుందాగా, అందంగా నవ్వుకుంటూ సాగిపోయింది.

తను అటు తిరగ్గానే, శీను ఎగిరి గంగారాం పీకపట్టుకుని:

"నీ తస్సాగొయ్యా,! మేఁవంతా అంకుల్స్ మా! పరువు తీశావు కదయ్యా." అంటూ క్రూరంగా అడిగాడు.

గంగారాం తాపీగా చేతులు విడిపించుకుని:

"మంచి గనిపించలే?? పెల్లయినోల్లు అంకుల్సే గదా మరి. తప్పు గిట్ల అన్ననా?" అంటూ రాగం తీశాడు.

"కరెక్టేలే. ఇప్పటి ట్రెండ్ అదేమరి. పెళ్ళికాని అమ్మాయిలు అలా పిలవడమే సేఫ్టీ" అంటూ నిస్సహాయంగా శూన్యంలోకి చూశాడు రమణ.

చక్కటి అందాన్ని చూసి "ఆహా" అని పరవశించడం, "ఓహో" అని మెచ్చుకోవడంలో పెద్ద తప్పులేదు.

ఆడవారు ఆ మాత్రం పొగడ్తకి అర్హులే అని నా



అభిమతం. 'నువ్వందంగా ఉన్నావు' అన్న కామెంట్‌ని అన్ని వయసుల ఆడవారూ, మనసులో బోల్డంత ఆనందపడుతూ, రహస్యంగానైనా తియ్యటి నవ్వొకటి నవ్వుకుంటారు.

కానీ... వచ్చిన చిక్కల్లా ఆకతాయిలతోనే. అమ్మాయి కనబడితే చాలు అడ్డూ ఆపూ లేకుండా రెచ్చిపోయి అల్లరిపెట్టేవారు కొందరైతే, 'పెళ్ళి నాడిచ్చినవి చాల్లేదు, ఇంకా పట్రా' అంటూ కిరోసిన్ పోసి వెలిగించే నికృష్టులు కొందరు.

మరి కొందరు, అయిందానికి కానిదానికి ఆడవారిని అనుమానించి, అవమానించి మనోవ్యధకి గురిచేసేవారు.

ఈ మధ్య మా కాలనీ చివర, రోడ్డు మీద, అమ్మాయిలను వేధించే ఆకతాయిల సంఖ్య తామర తంపరగా పెరిగింది. వచ్చిపోయే వారివి తమ వెధవ కామెంట్లతో వేధించి రాక్షసానందాన్ని పొందుతున్నారన్న కంప్లయింట్ పురస్కరించుకుని మేమూ వాళ్ళని ఒకటి రెండు సార్లు మందలించాం.

మార్పులేక పోగా, మరింత ఎక్కువయింది అల్లరి. మేం కూడా ఇక ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోకుండా అసలు సిసలు సగటు భారతీయుల్లా ఆ విషయాన్ని అంతటితో మర్చేపోయాం.

పాపం పండుతుందంటారే. అలా ఆకతాయిల అల్లరి ముదిరి పాకానపడి, నిన్న శ్రీదేవి బస్సెక్కుతుంటే కావాలని ముందునుంచి ఒకడూ, వెనక నుంచి ఇంకొకడూ ఆమెని రక రకాలుగా హత్తుకున్నారట.

ఆఫలాన విసిగిపోయిన శ్రీదేవి బస్సు ఆపించీ... వాళ్ళిద్దర్నీ కిందికి బరబరా లాక్కొచ్చి... అందరూ చూస్తుండగా "హ్హా...హ్హా" అంటూ కాళీ అవతారమెత్తి కరాటే తాండవం చేసిందట!

అడ్డొచ్చిన వారి అనుచర గణాల్ని సైతం వీరావేశంతో చితక్కొట్టేసిందంట!

డిష్యుం, కిష్యుం, డిష్యుం, కిష్యుం ఒకటే మోత, పరుగెత్తుతున్న పహిల్వానులను ఆపి పెళ్ళి బాజాలు వాయించి పారేసిందట!

ఆమె వీరావతారం చూసిన మిగతా ఆడవారు కూడా రెచ్చిపోయి, రాస్తారోకో నిర్వహించి కొంత గంటల పాటు నినాదాలిచ్చి స్త్రీ శక్తిని ప్రదర్శించారట.

అక్కడితో ఆగిపోకుండా శ్రీదేవిని నాలుగు రోడ్లూ ఊరేగించి, అప్పటికప్పుడే 'మహిళా హక్కుల పరిరక్షణ సంఘం' పేరిట ఓ అసోసియేషన్ స్థాపించేరు. కాలనీలో సమావేశాలు నిర్వహించారు.

ఆరేళ్ళ అమ్మాయిల నుంచి అరవై ఏళ్ళ అమ్మమ్మల వరకూ అంతా శ్రీదేవి పర్యవేక్షణలో కరాటే, కుంగ్‌ఫూ నేర్చుకోవాలని తీర్మానం చేసేశారు. అక్కడితో ఆగిపోయారా అంటే... ఊఁహు.. శివమెత్తిన శివంగుల్లా రాత్రంతా మేలుకుని కాలనీ గోడల మీద పోస్టర్లు అంటించారు.

దాన్లో...

"పెళ్ళికి కట్నం అడిగినా... ఈ వరకే తీసికున్న కట్నం చాల్లేదన్నా... రోడ్డున పోయే ఆడవారిని వేధించినా... తాగొచ్చినా... ఇష్టం లేకుండా బుగ్గల మీద చిటికేసినా... ఖబడ్దార్!!! మగాళ్ళని కైమా క్రింద కొట్టేసి, పెట్రోలు పోసి అంటించేస్తాం" అని రాశారు.

అది చదివిన మగాళ్ళకు కాళ్ళల్లోనుంచి వణుకు, గుండెల్లోంచి భయమూ పుట్టుకొచ్చి, కనిపించిన ఆడవారినల్లా 'చెల్లెమ్మా' అంటూ పిలవడం ప్రారంభించారు.

కన్‌ఫ్యూజన్ మరీ ఎక్కువైన హడావుడిరాయుళ్ళు చేసుకున్న శ్రీమతిని సహితం 'సిస్టర్' అని పిల్చి నాలికలు కర్చుకున్నారు. అంతా శ్రీదేవి మహాత్మ్యం.

("ఆడవారి నేడిపించడంలో ఆంధ్రాకు ఫస్ట్ ర్యాంక్" అన్న వార్త చదివీ... రచయిత). ★

